క్లుప్తంగా

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం... శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15మందిని అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 14 మందికి రూ.2వేల చొప్పున జరిమానా విధించగా మరో వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆట వస్తువులు, ఎడ్యుకేషన్ కిట్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశం, పార్కర్ హనీఫిన్ సిబ్బంది లక్ష్మి, ఇంద్రేశం ఎంపీయూపీఎస్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నర్సింహులు, మెడ్వాన్ కోఆర్డినేటర్ హాఫీజ్, బండి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ, పుస్తకాలు పంపిణీ



రాగి జావ, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ మారుతి రాథోడ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో రాగిజావ, పాఠ్యపుస్తకాలను ఎంఈఓ మారుతి రాథోడ్ ఉపాధ్యాయులకు సోమవారం పంపిణీ చేశారు. చేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ రవి, సీఆర్‌పీలు రాజు, రవి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: పొగాకుతో కలిగే అనర్థాలపై సోమవారం పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి స్థానిక పోలీసులతో కలిసి పట్టణంలోని రాజీవ్‌చౌక్, బసవేశ్వరచౌక్, బస్టాండ్, తదితర ప్రాంతాల్లో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరెట్, తంబాకు, జర్దా, పాన్‌మసాలా వాడకం వల్ల హైపర్‌టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. విద్యాలయాల చుట్టూ ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నిషేధమని, విక్రయిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

నూతన విద్యావిధానంతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న శిక్షకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): నూతన విద్యా విధానం ద్వారా బోధన చేస్తే ఆశించిన మేర ఫలితాలు వస్తాయని శిక్షకులు అనిత, నీరజ, రాధమ్మ అన్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు పాఠాలు బోధించే విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులను రైతువేదిక, ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు ఎలా బోధిస్తే అర్థమవుతుందో అనే విషయాలను కరదీపిక రూపంలో అందించినట్లు, వీటి ఆధారంగా బోధన చేయాలని, ఆటలు, పాటలు ద్వారా చదువు నేర్పించాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న అన్ని అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నారాయణ ఖేడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా రాజుపటేల్

నారాయణఖేడ్: మండల డిప్యూటీ తహశీల్దార్‌గా రాజుపటేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహశీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అధికారులు సుధాకర్, దినాకర్, జయశీల, నబీ, కిషన్, ధరణి ఆపరేటర్లు రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

ఘనంగా దివంగత మాజీ సీఎం జయంతి

జిల్లావ్యాప్తంగా దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా వైఎస్‌ఆర్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మెరుగైన పాలన అందించిన మహానేత వైఎస్‌ఆర్ ప్రతిఒక్కరి మదిలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు.



జహీరాబాద్ టౌన్: హోతి(బి) గ్రామంలో...



మునిపల్లి: కంకోల్ చౌరస్తాలో...



పటాన్‌చెరు టౌన్: వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నారాయణఖేడ్ ఎంపీ సురేష్ షెట్కార్ స్వగృహంలో...



జిన్నారం: మాదారంలో...



కల్హేర్: సిర్గాపూర్ మండల కేంద్రంలో...

ఉపాధ్యాయులకు సన్మానం



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న క్రీడాకారులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు నర్సింలు, నూతనంగా బదిలీపై వచ్చిన కుసుమ, సుజనను మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వాతి, నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సదాశివపేట మండల పరిధిలో...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్(కే)ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన మురార్జీ, ఉపాధ్యాయుడిగా సేవలందించిన ప్రవీణ్ కుమార్ బదిలీపై వెళుతున్న నేపథ్యంలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తోటిఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు నవనీత, సునీతలకు స్వాగతం పలికారు.

పీడీ శ్రీనివాస్‌కు సన్మానం

జోగిపేట(అందోల్): అందోలు ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తూ ఇటీవల ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతిపై జోగిపేట ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన శ్రీనివాస్ దంపతులను క్రీడాకారులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అందోలు ప్రాంతంలో ఎంతోమందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దిన శ్రీనివాస్‌కు రుణపడి ఉంటామని తెలిపారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో నాయకులు



ప్రధానోపాధ్యాయుడు మురార్జీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



మంజుల

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ప్యారానగర్ గ్రామానికి చెందిన జర్పోత్ మంజుల గడ్డపోతారంలోని ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 7వ తేదీన విధులకు వెళ్లిన మంజుల తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన యువతి తల్లిదండ్రులు కూతురు ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడు...



అంకుష్

సంగారెడ్డి టౌన్: కూలి పనులు చేసేందుకు వచ్చిన యువకుడు అదృశ్యమయ్యాడు. సంగారెడ్డి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... కామారెడ్డి జిల్లా.. గాంధారి మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన జాట్వే అంకుష్ కూలి పనులు చేసేందుకు సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అంకుష్‌కు అతని కుటుంబ సభ్యులు ఈ నెల 3వ తేదీ నుంచి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో సోమవారం అంకుష్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సంగారెడ్డి: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఏడో వార్డులో కల్వకుంటకు చెందిన లింగాగౌడ్ తన గేదెను ఎప్పటిలాగే మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మేత మేస్తుండగా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. తాను జీవనోపాధి కోల్పోవడమే కాకుండా అప్పు తెచ్చి గేదెను కొన్నానని లింగాగౌడ్ విలపించాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

మురుగు కాలువలు నిర్మించాలని వినతి

జహీరాబాద్: పట్టణంలోని ఉత్తమ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ ప్రజలు, సీఐటీయూ, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా పారిశుద్ధ్య సమస్యతో మురుగుకాలువలు లేకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మహిపాల్, బండి మోహన్, రాములు నేత, కాలనీవాసులు శ్యామ్, గోపాల్, నారాయణ, సంగమేశ్వర్, దేవపుత్ర, శబ్యూంసుందర్, రాములు, నర్సింహులు, దశరథ్, శ్రీనివాస్ ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు, నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గూండ్ల మాచునూర్ శివారులోని ఎపిటోరియా యూనిట్ 3 పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో సోమవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ పరిశ్రమలో అనేక ఏళ్లుగా కార్మికులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. అయినా ఇప్పటివరకూ పర్మనెంట్ చేయడం లేదన్నారు. గ్రేడ్ ప్రకారం.. రెండేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి కార్మికుడికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కానీ.. మూడేళ్లు గడుస్తున్నా గ్రేడ్ మార్చకపోవడం విచారకరమన్నారు. కార్మికులకు వేతనంతో కూడిన వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని యాజమాన్యం బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరికి పర్మినెంట్ చేసి హెల్త్‌కార్డులు, తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, నాయకులు రవి, రాజేష్, మల్లేశం, రాజు పాల్గొన్నారు.



అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంటలు సాగు చేస్తున్న రైతులకే..

- రైతు బంధు ఇవ్వాలి
- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం రైతు బంధు పథకం అమలు చేయాలని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సమాఖ్య కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్ని పంటలకు పంట పెట్టుబడికి అయిన ఖర్చులు పోను ఎకరానికి రూ.20 వేలు మిగిలే విధంగా గిట్టుబాటు ధర నిర్ణయించి రైతులకు మేలు చేయాలన్నారు. 20 ఎకరాల వరకు మాత్రమే రైతుబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, శంకర్, గంట శివయ్య, శ్రీశైలం, మల్లేశం, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పృథ్వీరాజ్

విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కేరూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్ సహకారంతో ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉచితంగా నోట్‌బుక్స్, ఇతర సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. వినయ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలో చదివే విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు మరింత కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నవీన్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాపయ్య, వీరన్న చెన్నగౌడ్, మల్లేశం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ బుక్కులను అందజేస్తున్న వినయ్‌గౌడ్, ఎంఈఓ కృష్ణ

డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలన

జహీరాబాద్ టౌన్: హోతి(కె)వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల అసంపూర్తి పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం జహీరాబాద్ డివిజన్ నాయకులు మహిపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హోతి(కె) గ్రామంలో పేదల కోసం ఇళ్లను నిర్మించిందన్నారు. అయితే నిర్మాణం పనులు పూర్తికాక ముందే అధికారులు డ్రాతీసి లబ్దిదారుల ఎంపిక చేపట్టారని తెలిపారు. ఇళ్లు కేటాయించి ఏడాది గడుస్తున్నా నేటికీ లబ్ధిదారులకు అప్పగించడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి వెంటనే పనులు పూర్తి చేయించి ఇళ్లను అప్పగించాలని కోరారు. సీపీఎం నాయకులు సలీమోద్దీన్, బక్కన్న, తిరుపతి, రాజు, యాదుల్ ఉన్నారు.



డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

పేలుళ్లపై ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న దాదిగూడెం గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని దాదిగూడెం గ్రామస్తులు కంకర క్రషర్‌లలో చేపడుతున్న బ్లాస్టింగ్‌లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో భారీ శబ్దాలు వస్తుండటంతో ఇళ్లు బీటలు వారుతున్నాయని, ఇంటిపైకప్పులకు పగుళ్లు వస్తున్నాయని వాపోయారు. తక్షణమే బ్లాస్టింగ్‌లను నిలిపివేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంఐఎంలో చేరిక

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ ఎంఐఎం పార్టీ గౌస్‌పాష ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన మైనార్టీ యువకులు సోమవారం హైదరాబాద్ ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాషఖాద్రీ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు అక్బర్, మోసిన్, అఖిల్, మోహిబ్, మహమూద్, పాయాజ్, నిజామొద్దీన్, అజాం మైనార్టీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మండల ప్రత్యేక అధికారిగా అఖిలేష్‌రెడ్డి**



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల ప్రత్యేక అధికారిగా అఖిలేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉమాదేవితో పాటు సిబ్బంది అఖిలేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, సిబ్బందితో అఖిలేష్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

◆ **రుణ పరిమితి పెంచాలి**

సంగారెడ్డి టౌన్: రైతులకు రుణపరిమితి పెంచాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో లీడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రఘుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాజ్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరసింహారెడ్డి, రాజయ్య, భూషణం పాల్గొన్నారు.

◆ **మున్సిపల్ కమిషనర్ పర్యటన**

జహీరాబాద్: మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్‌లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలిన గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఏఈ సత్యనారాయణతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

◆ **మీ–సేవ నిర్వాహకులకు అవగాహన**

మునిపల్లి(అందోల్): ధరణి, దరఖాస్తులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు తీసుకోవాలని మీ–సేవ నిర్వాహకులకు తహసీల్దార్ తెన్‌మొళి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల ప్రకారం.. ఆదాయం, కులం, నివాస ధృవపత్రాల దరఖాస్తుదారుల దగ్గర నుంచి రూ.40 తీసుకోవాల్సి ఉండగా రూ.100 పైన వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు అదనంగా తీసుకున్న మీ–సేవ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చందు, ఆర్‌ఐ, రవీందర్ రావు, జ్యోతి పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని 12వబ్లాక్‌లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజ్ పైపులైన్ సరిగా లేకపోవడం కారణంగా ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతున్నాయని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. బోనాల పండగ వరకు సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తామని తెలిపారు.

◆ **ఆర్టీసీ టెండర్లు రద్దు చేయాలి**

సంగారెడ్డి: ఇటీవల సంగారెడ్డి కొత్త బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన ఆర్టీసీ టెండర్లను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంత మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా ఆర్టీసీ స్థలంలో కొందరు డబ్బాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని టెండర్ ఇచ్చినట్లయితే వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్నవారిని కాదని మిగతా వారికి టెండర్ ఇవ్వడం సరైంది కాదన్నారు. ఇచ్చిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, నాయకులు కిరణ్‌గౌడ్, కసిని రాజు, కౌన్సిలర్ సోయల్, జార్జ్, నవాజ్ పాల్గొన్నారు.

◆ **అకౌంట్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ పోస్టాఫీస్‌లో ఖాతాలు కలిగి వారందరూ తమ అకౌంట్‌లో ఉన్న నిల్వలను చెక్ చేసుకోవాలని జహీరాబాద్ తపాలా శాఖ అధికారి రఘుదేవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టాఫీస్‌లో కొన్ని అకౌంట్స్‌ల్లో డబ్బు నిల్వల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించామని, ఖాతాదారులందరూ పోస్టాఫీస్‌కు వచ్చి తమ అకౌంట్స్‌లో ఉన్న డబ్బు నిల్వలను చెక్ చేసుకోవాలని సూచించారు.

◆ **వేతనం అందజేత**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు రాజపుష్ప నిర్మాణ సంస్థ ప్రైవేట్ ఉపాధ్యాయురాలిని నియమించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలికి సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట భాస్కర్ చేతుల మీదుగా వేతనం అందజేశారు. కార్యక్రమంలో శివశంకర్, కృష్ణ పాల్గొన్నారు.